


పెరిగిన విద్యుత్ వినియోగం

- గత సంవత్సరానికంటే అధికం
- ముందస్తు చర్యలు తీసుకుంటున్న అధికారులు



కరీంనగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా వ్యాప్తంగా విద్యుత్ వినియోగం పెరిగిపోతున్నది. జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ కనెక్షన్లు 1,09,210 ఉండగా, గృహాలకు 3,85,861 కనెక్షన్లు ఉన్నాయి. వేసవి కాలం సమీపిస్తుండడంతో వినియోగం రోజుకు రోజుకు పెరిగిపోతున్నది. గత సంవత్సరం ఫిబ్రవరిలో 317.24 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగమైంది. ఫిబ్రవరి మొదటి వారం నుంచే ఎండలు పెరిగిపోతుండడంతో రోజు వారీ విద్యుత్ వినియోగం పెరిగింది. ప్రతి రోజు 11.184 మిలియన్ యూనిట్ల విద్యుత్ వాడకం జరుగుతున్నట్లు అంచనా వేశారు. గత సంవత్సరం ఫిబ్రవరి 9 వరకు 90.09 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం కాగా, ఈ సంవత్సరం 9వ తేదీ వరకు 99.127 మిలియన్ యూనిట్ల విద్యుత్ వాడకం జరిగింది. గత సంవత్సరంతో పోల్చుకుంటే ఈసంవత్సరం విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉండే పరిస్థితులు కనిపిస్తున్నాయి. గృహ అవసరాలకు గత వేసవి మే నెలలో 51 మిలియన్‌యూనిట్ల విద్యుత్ వినియోగం కాగా, ప్రస్తుతం జనవరి నెలలోనే 32.2 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరిగింది. గత సంవత్సరం విద్యుత్ వినియోగాన్ని బేరీజు వేసుకుని వచ్చే మే నెలలో 56 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు అంచనా వేశారు. ఎల్‌టీహెచ్‌టీ లైన్లద్వారా జనవరి నెలలో 73 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం కాగా, దీన్ని బట్టి మార్చి నెలలో 80 మిలియన్‌యూనిట్ల విద్యుత్ వినియోగం జరిగే అవకాశం ఉందని అధికారులు అంచనాలు రూపొందించారు.

ఇబ్బందులు లేకుండా చర్యలు
- రమేష్‌బాబు, విద్యుత్ శాఖ ఎస్ఈ

జిల్లాలో వ్యవసాయానికి విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. వ్యవసాయంతో పాటు, గృహ అవసరాలకు విద్యుత్ ఎక్కువగా వినియోగిస్తున్నారు. గత సంవత్సరం అనుభవాలను దృష్టిలో ఉంచుకుని విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నాము.

● ఉష్ణోగ్రతలు పెరగడంతో భారీ డిమాండ్

జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో విద్యుత్‌కు భారీ డిమాండ్ ఏర్పడుతున్నది. జిల్లా వ్యాప్తంగా పంటల విస్తీర్ణం, గృహాల సంఖ్య పెరిగిపోవడంతో విద్యుత్ వినియోగం దానికి కనుగుణంగా పెరుగుతున్నది. జనవరి చివరి వారం నుంచే 34 నుంచి 35 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఫిబ్రవరి ప్రారంభం నుంచి 34 నుంచి 36 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గత సంవత్సరంతో ఉష్ణోగ్రతలు ఫిబ్రవరిలో జిల్లాలో 30 నుంచి 32 డిగ్రీల మధ్య ఉండేది. ఈ సంవత్సరం ఇదే ఉష్ణోగ్రతల్లో తేడాలు రెండు డిగ్రీలు ఉండడంతో ఈ ప్రభావం విద్యుత్ వినియోగంపై పడే అవకాశాలు ఉన్నాయని విద్యుత్ అధికారులు అభిప్రాయ పడుతున్నారు. ఫిబ్రవరి ప్రారంభం నుంచి ఎండలు పెరగడం వల్ల విద్యుత్ వినియోగాన్ని బట్టి సరిపడా విద్యుత్‌ను అందిస్తున్నారు.

విద్యార్థుల్లోని సృజనాత్మకతను ప్రోత్సహించాలి

- కలెక్టర్ పమేలా సత్పతి



విద్యార్థులు తయారు చేసిన వివిధ కళాకృతులను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకతను గుర్తించి వారిని ప్రోత్సహించాలని కలెక్టర్ పమేలా సత్పతి ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఏర్పాటు చేసిన హస్తకళా మేళా, సైన్స్ ఎగ్జిబిషన్‌ను కలెక్టర్ సందర్శించారు. కస్తూర్బా బాలికల పాఠశాల, వివిధ ప్రభుత్వ పాఠశాలల, గురుకులాల విద్యార్థులు తయారు చేసిన వివిధ కళాకృతులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అందమైన వస్తువులను విద్యార్థులు తయారు చేస్తున్నారని, ఇవి ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని అభినందించారు. కార్యక్రమంలో డీఈవో సీహెచ్‌వీఎస్ జనార్దన్‌రావు, జిల్లా సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డి, క్వాలిటీ కో ఆర్డినేటర్ అశోక్‌రెడ్డి, బాలికల అభివృద్ధి అధికారి కృపారాణి పాల్గొన్నారు.

ఘనంగా కొత్తగట్టు జాతర



కొత్తగట్టులో మత్స్యగిరీంద్రస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

శంకరపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తగట్టు గుట్టపై కొలువైన మత్స్యగిరీంద్రస్వామిని దర్శించుకోవడానికి భక్తులు బుధవారం పోటెత్తారు. మత్స్యగిరీంద్రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం పౌర్ణమిని పురస్కరించుకుని నిర్వహించిన జాతర నిర్వహించారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. పౌర్ణమి సందర్భంగా అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కోనేటిలో పుణ్యస్నానాలు ఆచరించి, స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ చైర్మన్ ఉప్పుగల్ల మల్లారెడ్డి, ఆలయ ఈవో సుధాకర్, ధర్మకర్తలు భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. కేశవపట్నం ఎస్ఐ కొత్తపల్లి రవి ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం ఏర్పడకుండా పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టారు.

నిలిచిన పత్తి కొనుగోళ్లు



మార్కెట్‌యార్డులో రైతులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న

- మద్దతు ధర చెల్లించాలని చైర్‌పర్సన్ ఆదేశం
- గిట్టుబాటు కాదంటూ వెనుదిరిగిన ఖరీదుదారులు
- ఆలస్యంగా ప్రారంభమైన కొనుగోళ్లు

జమ్మికుంట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రైవేట్ ట్రేడర్స్ పత్తి కొనుగోళ్లకు బుధవారం మధ్యాహ్నం వరకు దూరంగా ఉన్నారు. సోమవారం మార్కెట్ యార్డుకు 36 మంది రైతులు 190క్వింటాళ్ల విడి పత్తి తీసుకువచ్చారు. ఉదయం 9గంటలకు యార్డుకు వచ్చిన ఖరీద్‌దారులు పత్తిని పరిశీలించి బహిరంగ వేలం ద్వారా నాణ్యమైన పత్తికి గరిష్ఠ ధర ఏడు వేలు, కనిష్ఠ ధర 6,200 రూపాయలు నిర్ణయించారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) సర్వర్ పని చేయకపోవడంతో రెండు రోజులుగా కొనుగోళ్లు నిలిచిపోయాయి. తమకు గిట్టుబాటు ధర దక్కడం లేదంటూ పలువురు రైతులు కార్యాలయంలో చైర్‌పర్సన్ పుల్లూరి స్వప్న-సదానందంను కలిసి వివరించారు. ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం యార్డులో ధరలు నిర్ణయించాలని ఖరీదు దారులను చైర్‌పర్సన్ ఆదేశించారు. ఆ ధరలు తమకు గిట్టుబాటు కావంటూ ఖరీదుదారులు వెనుదిరిగారు. చైర్‌పర్సన్ సీసీఐ అధికారికి ఫోన్ చేసి యార్డుకు పిలిపించగా, ఆధార్ సర్వర్ పని చేయడం లేదని కొనుగోళ్లు చేపట్టలేమని తెలిపారు. ఉదయం 8 గంటలకు యార్డుకు వచ్చిన రైతులు మధ్యాహ్నం 12 గంటల వరకు వేచి చూశారు. ఖరీదుదారులు యార్డుకు రాక పోవడంతో చైర్‌పర్సన్ ఫోన్ చేసి పత్తి కొనుగోళ్లు చేపట్టాలని సూచించారు. రైతులు 12.30 గంటలకు జిన్నింగ్ మిల్లులకు వెళ్లి వారు చెప్పిన ప్రకారం ఖరీదుదారులకు పత్తి విక్రయించారు.

● జిల్లా వ్యాప్తంగా కొనుగోళ్ల నిలిపివేత

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కరీంనగర్, జమ్మికుంట, చొప్పదండి, గోపాల్‌రావుపేట వ్యవసాయ మార్కెట్ల పరిధిలో సీసీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పత్తి కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేసినట్లు జిల్లా మార్కెటింగ్ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10 నుంచి ఆధార్ సర్వర్ డౌన్ ఉందని, ఈ కారణంతో పత్తి కొనుగోళ్లను తాత్కాలికంగా నిలిపివేశామన్నారు. పత్తి రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రాలకు పత్తిని తీసుకురావద్దని, ఆధార్ సర్వర్ పునరుద్ధరణ అయిన తర్వాత పత్రికా ప్రకటన విడుదల చేస్తామని, రైతులు సహకరించాలని కోరారు.

రైతులు సహకరించాలి
- పుల్లూరి స్వప్న, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్



జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ యార్డులో సీసీఐ కొనుగోళ్లు తాత్కాలికంగా నిలిచిపోయాయి. ఆధార్ సర్వర్ పని చేయక పోవడంతో రెండు రోజులుగా సీసీఐ కొనుగోళ్లు చేపట్టడం లేదు. తిరిగి కొనుగోళ్లు ప్రారంభం అయిన తర్వాత రైతులకు సమాచారం అందిస్తాం. అప్పటి వరకు రైతులు సహకరించాలి.

డీలర్లకు డిప్లొమా సర్టిఫికెట్ల పంపిణీ

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆత్మ, డీడీఏ, ఎఫ్‌టీసీ ఆధ్వర్యంలో 2023-24 శిక్షణ శిబిరంలో పాల్గొని ఉత్తీర్ణులైన 40 మంది ఎరువులు, విత్తనాల డీలర్లకు డిప్లొమా సర్టిఫికెట్లను జిల్లా వ్యవసాయశాఖ అధికారి భాగ్యలక్ష్మి పంపిణీ చేశారు. బుధవారం కరీంనగర్ కృషీభవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్టిఫికెట్లు అందుకున్న డీలర్లను అభినందించారు. కార్యక్రమంలో ఆత్మ పీడీ చత్రునాయక్, జమ్మికుంట కేవీకే సైంటిస్ట్ వెంకటేశ్వర్లు, జిల్లా ఉద్యానశాఖ అధికారి శ్రీనివాస్, వ్యవసాయ పరిశోధన కేంద్రం సైంటిస్ట్ ఉషారాణి, ఫెసిలిటేటర్ రాంచంద్రరావు, రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయ అధికారి మమత పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళికి అనుగుణంగా విధులు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లక్ష్మికిరణ్

కరీంనగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎన్నికల కమిషన్ నియమావళికి అనుగుణంగా ఎన్నికల విధులు నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ లక్ష్మికిరణ్ ప్రిసైడింగ్ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలు పాటించాలని, ఏమైనా సందేహాలుంటే ఉన్నతాధికారుల ద్వారా వాటిని నివృత్తి చేసుకోవాలని సూచించారు. పోలింగ్ రోజున నిర్ణీత ఫారాలను పొరపాట్లు లేకుండా పూరించాలని, ఫారం-16, పీవో డైరీని జాగ్రత్తగా నింపాలన్నారు. ఓటరు వివరాలను పరిశీలించి గుర్తింపు కార్డుతో సరి చూసుకోవాలన్నారు. ఎన్నికల నిబంధనలపై ప్రతి ప్రిసైడింగ్ అధికారికి పూర్తి అవగాహన ఉండాలన్నారు. బ్యాలెట్ బాక్సు సీల్ విధానం డెమో ప్రదర్శించారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ అధికారి పవన్‌కుమార్, డీఆర్డీవో శ్రీధర్, మాస్టర్ ట్రైనర్లు అమరేందర్‌రెడ్డి, సంపత్, రజనీష్ పాల్గొన్నారు.

● ఆర్థిక మద్దతు పథకాల లక్ష్య సాధనకు సహకరించాలి

జిల్లాలో వివిధ ఆర్థిక మద్దతు పథకాల లక్ష్యసాధనకు రుణాలు అందించడంలో బ్యాంకర్లు పూర్తిస్థాయిలో సహకరించాలని అడిషనల్ కలెక్టర్ లక్ష్మికిరణ్ కోరారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకర్లు, జిల్లా అధికారులతో రైతులు, స్వయం సహాయక సంఘాలకు, పీఎంజీపీపై రుణాల మంజూరు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ సంక్షేమశాఖల పథకాలకు సంబంధించి రుణ లక్ష్య పురోగతిపై డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ లక్ష్మికిరణ్ మాట్లాడుతూ వివిధ ఆర్థిక మద్దతు పథకాలకు సంబంధించి వందశాతం లక్ష్యసాధనకు బ్యాంకర్లు, ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. రైతుబంధు, రైతుబీమా, ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధిని పంట రుణాలకు జమ చేసుకోవద్దని అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి డిసెంబర్ నెలాఖరు వరకు 9,135.26 కోట్ల రూపాయల రుణాలను మంజూరు చేసినట్లు తెలిపారు. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలకు 3,871.78 కోట్లు, ఎంఎస్ఎంఈ రంగంలో 1,735.58 కోట్లు, విద్యార్థులకు 53.92 కోట్లు, గృహ రుణాలు 583.92 కోట్లు, స్వయం సహాయక సంఘాలకు 678.25 కోట్లు, ఇతర రంగాలకు 2,211.81 కోట్ల రుణాలను మంజూరు చేసినట్లు తెలిపారు. అర్హులైన రైతులందరికి రుణాలు మంజూరు చేయాలని అదనపు కలెక్టర్ బ్యాంకు అధికారులను ఆదేశించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఉన్న లక్ష్యాల్లో 85.10 శాతం పూర్తయిందని, పెండింగ్‌లో ఉన్న రుణాల ప్రతిపాదనలు బ్యాంకర్లకు అందించి త్వరగా మంజూరు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు మేనేజర్ ఆంజనేయులు, ఆర్‌బీఐ అధికారి పల్లవి, నాబార్డు ఏజీఎం ప్రకాశ్, ఎస్‌బీఐ సీఎం రాంచంద్రుడు, జీఎం డీఐసీ శ్రీధర్, డీఏవో భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఇసుక రవాణాను పర్యవేక్షించాలి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఇసుక రవాణాను కట్టుదిట్టంగా పర్యవేక్షించాలని, ఇందుకు ప్రత్యేక అధికారులను నియమించాలని రాష్ట్ర ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి కలెక్టర్లను ఆదేశించారు. ఇసుక పాలసీపై ఆమె కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇసుక రీచ్‌ల వద్ద తనిఖీలు నిర్వహిస్తూ అక్రమ ఇసుక రవాణా నివారణకు అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు ఉచితంగా ఇసుక సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సామాన్య ప్రజలకు అతి తక్కువ ధరకు ఇసుక అందుబాటులోకి తీసుకు రావాలని, ఇసుక బుక్ చేసిన 48 గంటల వ్యవధిలోగా వినియోగదారుడికి చేరేలా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఇసుక రవాణా చేసే వాహనాలకు ట్రాకింగ్ సిస్టం ఏర్పాటు చేసి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. ఇసుక రీచ్‌ల వద్ద 360 డిగ్రీల కెమెరాలు, లైట్స్ ఏర్పాటు చేయాలని, ఇసుక స్టాక్ యార్డుల వద్ద కట్టుదిట్టమైన ఫెన్సింగ్‌తోపాటు ఎంట్రీ ఎగ్జిట్లను ఏర్పాటు చేయాలన్నారు. ఆఫీస్ టైమింగ్స్ సమయంలో ఆన్‌లైన్ బుకింగ్ చేసుకునేలా మార్పులు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ మానకొండూరు మండలం ఊటూరులో 6,700 మెట్రిక్ టన్నులు, వీణవంక మండలం చల్లూరులో 6,900 మెట్రిక్ టన్నుల ఇసుక నిలువలు ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఈ రెండు ప్రాంతాల్లో సీసీ కెమెరాలు నిఘా వ్యవస్థ ఉందన్నారు. ఇప్పటికే రెవెన్యూ, మైన్స్, పోలీస్, రవాణా శాఖల అధికారులు తనిఖీ చేసినట్లు తెలిపారు.

ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

ఇసుక రవాణాపై నిరంతర నిఘా కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని మైనింగ్ అధికారులకు కలెక్టర్ సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం మైనింగ్, రవాణా అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనుమతి లేకుండా ఇసుక రవాణా చేసినా, అనుమతి కంటే ఎక్కువ లోడుతో ఇసుక తరలించినా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెక్ పోస్టుల వద్ద నిఘాను పెంచాలని, సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ పి పురుషోత్తం, అసిస్టెంట్ జియాలజిస్ట్ వెంకటేశ్వర్, ఎంవీఐ రవికుమార్, ఏఎంవీఐ హరితయాదవ్ పాల్గొన్నారు.

ధర పెరిగినా.. డిమాండ్ తగ్గలే..



- మద్యం డిపోలో రూ. ఐదు కోట్ల బీర్ల కొనుగోళ్లు
- ఒక్కరోజే 25 వేల పెట్టెల అమ్మకం
- రిటైల్ షాపులకు సరఫరా ప్రారంభం

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మద్యం (ఐఎంఎల్)డిపోలో బుధవారం ఒక్కరోజే 25 వేల పెట్టెల బీర్ల అమ్మకాలు జరిగాయి. వీటి విలువ 5 కోట్లపైన ఉంటుంది. చాలా కాలం నుంచి బీర్ల కంపెనీలు ధరలను పెంచాలని కోరుతుండగా ప్రభుత్వం రెండు రోజుల క్రితం బీర్ల ధరలను 15 శాతం వరకు పెంచింది. దీంతో ఒక్కో బీరుపై 30 రూపాయల వరకు ధరలు పెరిగాయి. 12 బీర్లు ఉన్న పెట్టెపై 350 రూపాయల వరకు ధర పెరిగింది. సరాసరిగా ఒక్కో పెట్టె ధర కంపెనీలను బట్టి 1,800 నుంచి 2,500 రూపాయల వరకు ఉంది. పెరిగిన బీర్ల ధరలు బుధవారం నుంచి అమల్లోకి వచ్చాయి. మద్యం డిపో నుంచి వైన్స్, కొత్త ధరలపై స్పష్టత లేకపోవడంతో బార్‌లకు మంగళవారం బీరు సరఫరాను కరీంనగర్ మద్యం డిపో అధికారులు నిలిపివేశారు. బుధవారం ఉదయం నుంచి పెరిగిన ధరలతో మద్యం డిపో నుంచి రిటైలర్లకు బీర్ల సరఫరా పునరుద్ధరించారు. దీంతో ఒక్క రోజే 25 వేల పెట్టెల బీర్ల మద్యం లైసెన్స్‌దారులు కొనుగోలు చేశారు. కింగ్‌ఫిషర్ కంపెనీ కొద్ది రోజులు బీర్ల ఉత్పత్తిని నిలిపివేయడంతో మద్యం డిపోలో బీర్ల తగినంత లేనికారణంగా డిస్టిల్లరీల నుంచి వచ్చిన స్టాక్‌ను వచ్చింది వచ్చినట్టుగా ఇప్పటి వరకు వైన్స్, బార్లకు తక్కువ మొత్తంలో సరఫరా చేశారు. కింగ్‌ఫిషర్ కంపెనీ ఇటీవల మళ్లీ మద్యం డిపోలకు సరఫరాను పునరుద్ధరించింది.

> జిల్లాలో 94 వైన్‌షాపులు, 34 బార్లు, క్లబ్‌లున్నాయి. వీటి ద్వారా జనవరి నెలలో 1,58,050 పెట్టెల బీరు అమ్మకాలు, 83,570 పెట్టెల లిక్కర్ అమ్మకాలు జరిగాయి. వీటి విలువ 89.51 కోట్ల రూపాయలుంది. ఇది మద్యం డిపోలో అమ్మకాల విలువ. దీనికి మరో 20 శాతం మార్జిన్‌తో కలిసి రిటైల్ షాపుల్లో మద్యం విక్రయాలు జరిగాయి.

● కరీంనగర్ డిపో పరిధిలో 192 వైన్స్

కరీంనగర్ మద్యం డిపో పరిధిలోని కరీంనగర్, జగిత్యాల జిల్లాలతోపాటు పెద్దపల్లి జిల్లాలోని కొన్ని మద్యం షాపులకు కరీంనగర్ మద్యం డిపో నుంచే మద్యం సరఫరా అవుతున్నది. మద్యం డిపో పరిధిలోని మూడు జిల్లాలకు చెందిన 192 వైన్‌షాపులు, 58 బార్లకు మద్యం సరఫరా అవుతున్నది. డిపో పరిధిలోని 192 వైన్స్, 58 బార్ల లైసెన్స్‌దారులు వేసవి కాలంలో రోజుకు 25 వేల పెట్టెల బీర్లు కొనుగోలు చేస్తారు. ఇతర సమయంలో 12 వేల నుంచి 15 వేల పెట్టెల బీర్ల కొనుగోళ్లు జరుగుతాయి.

● మద్యం ప్రియులపై భారం....

జిల్లాలో మద్యం ఏరులైపారుతున్నది. ప్రభుత్వం మద్యం షాపుల లైసెన్స్ ఫీజుతోపాటు, మద్యం ధరలను పెంచుతూ పోతుండడంతో ఆ భారం మద్యం ప్రియులపై పడుతున్నది. మద్యం బాబులు వెచ్చిస్తున్న డబ్బు సర్కార్‌కు ప్రధాన ఆదాయవనరుగా మారింది. మద్యం వల్ల ప్రధానంగా కూలీలు, పేద, మధ్యతరగతి కుటుంబాలలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తి కొందరు బానిసగామారి ఆత్మహత్యలకు పాల్పడుతున్న సంఘటనలు తరచుగా జరుగుతున్నాయి.

గ్రామాల వివరాలు
'మేరీ పంచాయత్'లో..
- పథకాలు, సేవల వివరాలకు ప్రత్యేక యాప్
- నిధులు, ఖర్చుల పారదర్శకతకు ప్రాధాన్యం
6

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

కరీంనగర్ లీగల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తల్లీకూతురును హత్య చేసిన కేసులో నిందితుడు కొక్కిస వెంకటేశ్ (55)కు జీవిత ఖైదుతోపాటు 2,500 రూపాయల జరిమానా విధిస్తూ కరీంనగర్ జిల్లా జడ్జి బి.ప్రతిమ బుధవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లా దండెపల్లికి చెందిన కొక్కిస వెంకటేశ్ అలియాస్ వెంకన్న బతుకుదెరువుకోసం హుజూరాబాద్‌కు వచ్చి జీవిస్తున్నాడు. అతడి మొదటి భార్య ముప్పై ఏళ్ల క్రితం విడాకులు తీసుకొని వెళ్లిపోయింది. అనంతరం కూతురు ఉన్న రమను రెండో పెళ్లి చేసుకున్నాడు. ఆటో నడుపుకుంటూ స్థానికప్రతాపవాడలో నివాసముంటున్నాడు. తరచూ భార్య, కూతురుతో ఆర్థిక విషయాల్లో గొడవలు జరుగుతుండేవి. దీంతోపాటు వివాహేతర సంబంధం ఉన్నట్లు అనుమానం పెంచుకున్నాడు. 21జనవరి 2021న రాత్రి భార్య రమ, కూతురు ఆమని (24) నిద్రిస్తుండగా ఇనుపపైపుతో తలలపై తీవ్రంగా గాయపరిచి చంపాడు. హుజూరాబాద్ పోలీసులు వెంకటేశ్‌పై కేసు నమోదు చేయగా ఏసీపీ కె.వెంకటరెడ్డి దర్యాప్తు చేపట్టారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జూలూరి శ్రీరాములు కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టి విచారించారు.

హత్యాయత్నం కేసులో భర్తకు ఏడేళ్ల జైలు

పెద్దపల్లి రూరల్,ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలితం గ్రామ పంచాయతీ పరిధిలోని పుట్టపల్లిలో 2016లో జరిగిన హత్యాయత్నంలో భర్త సిద్ధం చంద్రమౌళికి ఏడు సంవత్సరాల జైలు శిక్షను ఖరారు చేస్తూ పెద్దపల్లి అసిస్టెంట్ సెషన్ జడ్జి శ్రీనివాసులు బుధవారం తీర్పునిచ్చారు. 2016లో పుట్టపల్లికి చెందిన సిద్ధం చంద్రమౌళి ఓ తగాదా విషయంలో భార్యపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. అప్పటి పెద్దపల్లి ఎస్ఐ రాజ్‌కుమార్ కేసు నమోదు చేయగా 8 ఏళ్ల అనంతరం కోర్టులో విచారణ కొనసాగింది. ఎస్ఐ లక్ష్మణ్‌రావు సాక్ష్యాధారాలను ప్రవేశపెట్టారు. ఈమేరకు పెద్దపల్లి సెషన్స్ జడ్జి శ్రీనివాసులు నిందితునికి ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.2,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.

దుప్పి మాంసం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు



దుప్పి మాంసాన్ని స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

గంభీరావుపేట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండలం ముస్తఫానగర్ అడ్డగుట్ట ప్రాంతంలో దుప్పి మాంసాన్ని విక్రయిస్తున్న వ్యక్తిని బుధవారం ఫారెస్ట్ అధికారులు పట్టుకుని కేసు నమోదు చేశారు. కోనరావుపేట మండలానికి చెందిన కొమురయ్య అనే వ్యక్తి ముస్తఫానగర్ గ్రామ సమీపంలో మాంసాన్ని అమ్ముతుండగా ఫారెస్ట్ అధికారులు పట్టుకున్నారు. సిరిసిల్ల ఫారెస్ట్ రేంజ్ డిప్యూటీ అధికారి అంజలి ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. కొనరావుపేట మండలానికి చెందిన గంట కొమురయ్య అనే వ్యక్తి దుప్పిని వేటాడి హతమార్చాడని వెల్లడించారు. దుప్పి మాంసాన్ని ముక్కలుగా చేసి ప్యాకెట్లలో కిలో చొప్పున అమ్ముతున్నట్లు అందిన పక్కాసమాచారం మేరకు ఆప్రాంతానికి వెళ్లి గాలించామన్నారు. అడ్డగుట్ట ప్రాంతంలోని ఓ చెట్టు కింద దుప్పి మాంసాన్ని కొమురయ్య విక్రయిస్తున్నట్టు గమనించి సిబ్బంది చాకచక్యంగా వెళ్లి పట్టుకున్నారని పేర్కొన్నారు. దాదావు 33కేజీల దుప్పి మాంసాన్ని స్వాధీనం చేసుకోవడంతోపాటు నిందితుడైన కొమురయ్యపై కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. వారి వెంట బీట్ ఆఫీసర్లు రమేష్, జ్యోతి తదితరులు ఉన్నారు.

వృద్ధుడి అదృశ్యం.. కేసు నమోదు



కట్ల పర్శయ్య (ఫైల్)

కోనరావుపేట, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పింఛన్ డబ్బులు తీసుకొని వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లిన వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం మల్కపేట గ్రామానికి చెందిన కట్ల పర్శయ్య(68) సోమవారం పింఛన్ డబ్బులు తీసుకొని వస్తానని ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. ఆచూకీ కోసం ప్రయత్నించగా సిరిసిల్ల బస్టాండ్ ఆవరణలో సీసీ కెమెరా ఫుటేజ్ ప్రకారం కామారెడ్డి బస్సు ఎక్కి వెళ్లినట్లు గుర్తించారు. వృద్ధుడి ఆచూకీ తెలిసిన వ్యక్తులు కోనరావుపేట పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ ప్రసాద్ రెడ్డి కోరారు.

కాలు జారిపడి ఒకరి మృతి

సుల్తానాబాద్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలోని పూసాల రోడ్డులో ఓవ్యక్తి స్నానాలగదిలో కాలుజారి పడిపోవడంతో గాయపడి మృతిచెందాడు. పట్టణానికి చెందిన మల్లేశం (58) బుధవారం స్నానంచేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయం కావడంతో వెంటనే అతన్ని సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు.

గ్రామాల వివరాలు 'మేరీ పంచాయత్'లో..



- పథకాలు, సేవల వివరాలకు ప్రత్యేక యాప్
- నిధులు, ఖర్చుల పారదర్శతకు ప్రాధాన్యం

చొప్పదండి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఏదైనా పనుల వివరాలు కావాలని అడిగితే చెప్పేవారు ఉండరు. ఎవరైనా ప్రశ్నిస్తే సమాధానం చెప్పే వారు ఉండరు. విసుగు చెంది వివరాల కోసం సమాచార హక్కు చట్టం ద్వారా తెలుసుకోవాల్సిన పరిస్థితి ప్రజలకు ఉండేది. ఇప్పుడు అలాంటి సమస్య లేకుండా కేంద్ర ప్రభుత్వం మేరీ పంచాయత్ యాప్ ప్రవేశపెట్టింది. గ్రామ పంచాయతీల అభివృద్ధి, ఇతర వివరాలు ప్రజలు తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం యాప్‌ను రూపొందించింది. పంచాయతీల ఆదాయ, వ్యయం విషయాల్లో పారదర్శకత పాటించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధుల వివరాలను పంచాయతీ కార్యాలయానికి వెళ్లకుండానే ప్రజలు ఈ యాప్‌లో పరిశీలించవచ్చు. ఈ యాప్‌ను 2019 లో కేంద్ర ప్రభుత్వం రూపొందించగా సాంకేతిక కారణాలతో పూర్తిస్థాయిలో అందుబాటులకు తీసుకురాలేకపోయింది. ప్రస్తుతం ఈ యాప్ పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులోకి వచ్చింది.

●గ్రామాల వివరాలన్నీ అందుబాటులో..



గ్రామ పంచాయతీల్లో విధుల వివరాలతోపాటు, కార్యదర్శి, గ్రామ కమిటీలు ఆస్తుల వివరాలు, జనాభా వివరాలు యాప్‌లో అందుబాటులోకి వచ్చాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి యేటా పంచాయతీలకు మంజూరు చేసే నిధుల వివరాలు, పనులకు చేసిన ఖర్చు, పనులు ఏ దశలో ఉన్నాయో అనే వివరాలు యాప్‌లో నమోదై ఉంటాయి. పంచాయతీలకు మంజూరైన నిధులు కార్మికులు, సిబ్బంది వేతనాలు ఇతర ఖర్చులు యాప్‌లో పొందుపరిచారు. స్టేట్ ఫైనాన్స్, సెంట్రల్ ఫైనాన్స్ కమిషన్ నిధుల వివరాలు కూడా యాప్‌లో ప్రజలకు అందుబాటులో ఉంటాయి.

● పనులు, నిధుల వివరాలు

పారదర్శక పాలనకు గ్రామ పంచాయతీల్లో వివిధ పథకాల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతుంటారు. నిధుల వినియోగానికి సంబంధించిన వివరాలు ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేయడంతో గ్రామాల్లో పారదర్శక పాలన సాగుతుందని పాలకులు భావిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులు ఎన్ని మంజూరయ్యాయో, పనులు ఏ మేరకు పూర్తయ్యాయి, వాటి చెల్లింపులు ఎంత జరిగాయి అనేది ప్రజలు యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. గ్రామాలకు ప్రభుత్వాలు ఎలాంటి పనులను మంజూరు చేస్తుందో ఎంత ఖర్చు చేసిందో ప్రజలు తెలుసుకోవచ్చు. పనులను చేసే సమయంలో జీపీఆర్ఎస్ ద్వారా పనిని గుర్తించే అవకాశం ఉంటుంది. పనులకు కేటాయించిన డబ్బులను ఇతర గ్రామాలకు వినియోగించేందుకు వీలు లేకుండా ఉంటుంది. పాలకవర్గాలు ఏలాంటి పొరపాట్లు చేయకుండా ఉంటుంది. ప్రజాప్రతి నిధులు, అధికారులు తప్పుడు నివేదికలను రూపొందించే అవకాశం లేకుండా ప్రజలు ప్రశ్నించే వీలు యాప్ ద్వారా కలుగుతుంది. నిధుల దుర్వినియోగం జరుగకుండా, ఎంత మంజూరు అయ్యాయి ఎంత ఖర్చు చేశారనేది కూడా యాప్ ద్వారా ప్రజలు తెలుసుకోవచ్చు.

● యాప్ డౌన్‌లోడ్ చేసుకోండి ఇలా

స్మార్ట్ ఫోన్‌లో ఉండే ప్లేస్టోర్ యాప్ లోకి వెళ్లి మేరీ పంచాయత్ పేరుతో వచ్చే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. లాగిన్ కాగానే రాష్ట్రం, జిల్లా, మండలం, గ్రామాన్ని ఎంపిక చేసుకోవాలి. గ్రామాన్ని ఎంపిక చేసుకున్న తర్వాత పంచాయతీకి సంబంధించిన అంశాలు కనిపిస్తాయి. జనాభా, ఆదాయ వ్యయాలు, చేపట్టిన పనులు, నిధులు తదితరాంశాలు అందులో అందుబాటులో ఉంటాయి. గ్రామ పంచాయతీకి సంబంధించిన ప్రతి కమిటీ వివరాలు, పనుల వివరాలు ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు.

యజమాని ఇంట్లో కేర్ టేకర్ చోరీ

● నిందితుడి రిమాండ్



నిందితుడి అరెస్టు చూపుతున్న ఏసీపీ వెంకటస్వామి

కరీంనగర్‌క్రైం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): యజమాని ఇంట్లో కేర్‌టేకర్ చోరీకి పాల్పడగా పోలీసులు రిమాండ్‌కు తరలించారు. కరీంనగర్‌టౌన్ ఏసీపీ వెంకటస్వామి బుధవారం కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. కరీంనగర్ సాయినగర్‌కు చెందిన రవికంటి అఖిల్ టవర్‌సర్కిల్‌లో ఎలక్ట్రికల్ షాపు నిర్వహిస్తున్నాడు. ఈనెల 9న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి తిరుమల తిరుపతి దైవదర్శనానికి వెళ్లాడు. బుధవారం ఉదయం తిరిగి వచ్చేసరికి ఇంటికి తాళం వేసి ఉన్నా వెనకవైపున కిటికీ పగులగొట్టి ఉంది. అనుమానంతో లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని 98 గ్రాముల బంగారం కనిపించలేదు. బాధితుడు రెండో రాణా పోలీసులకు ఫిర్యాదుచేశాడు. తనఇంట్లో పని చేస్తున్న కేర్‌టేకర్‌పై అనుమానం ఉన్నట్లు పేర్కొన్నాడు. రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడిని పట్టుకొని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. అఖిల్ తండ్రి మనోహర్ ఆరోగ్యం బాగా లేకపోవడంతో గర్రెపల్లికి చెందిన బెజ్జంకి సంతోష్‌ను నాలుగు నెలల క్రితం కేర్‌టేకర్ నియమించుకున్నాడు. కుటుంబ సభ్యులులేని సమయంలో సంతోష్ ఇల్లంతా తిరుగుతుండేవాడు. ఇంటి వెనుకవైపు కిటికీకి గ్రిల్‌లేదనే విషయం గమనించాడు. అవకాశం కోసం చూసిన సంతోష్ యజమాని తిరుపతికి వెళ్లడంతో బీరువా తాళాలను పగులగొట్టి లాకర్‌లో ఉన్న 98 గ్రాముల బంగారం ఎత్తుకెళ్లాడు. అందులో కొంత విక్రయించి జల్సాలకు ఖర్చు చేశాడు. మిగతా బంగారం అమ్ముకునేందుకు కరీంనగర్‌లోని ఐబీచౌరస్తా వద్ద ఉండగా పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి 7.45 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు, రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని పట్టుకున్న రెండోరాణా సీఐ కె సృజన్‌రెడ్డి, ఎస్సై చంద్రశేఖర్, కానిస్టేబుల్ రాజునాయక్, రాంకుమార్‌ను ఉన్నతాధికారులు అభినందించారు.

బావిలో దూకి వృద్ధురాలు ఆత్మహత్య



రాధవ్వ (ఫైల్)

పెగడపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నంచర్ల గ్రామానికిచెందిన దాసరి రాధవ్వ(85) వృద్ధాప్యం, అనారోగ్య సమస్యలు భరించలేక వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాధవ్వ మంగళవారం రాత్రి తిని పడుకుందని, బుధవారం ఉదయం కుటుంబ సభ్యులు లేచేసరికి ఇంట్లో లేకపోవడంతో చుట్టుపక్కల గాలిస్తుండగా, అదే గ్రామానికి చెందిన ఓ రైతు వ్యవసాయ బావిలోపడి మృతిచెందిందన్నారు. మృతురాలి కుమారుడు రాయమల్లు ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ రవీందర్ కేసు నమోదు చేశారు.

చందాల కోసం వచ్చి వృద్ధురాలి బంగారం చోరీ



ఊట్‌పల్లిలో సీసీ ఫుటేజీలో రికార్డ్ అయిన యువతులు

కథలాపూర్, ఫిబ్రవరి 12(ఆంధ్ర జ్యోతి): కథలాపూర్ మండలం ఊట్‌పల్లిలో అనాథాశ్రమం కోసం చందాలు వసూలు చేస్తున్నామని నమ్మించిన ఇద్దరు యువతులు బుధవారం గజ్జెల్లి భూదవ్వ(70) అనే వృద్ధురాలి మెడలోంచి ఏడు తులాల బంగారం ఎత్తుకెళ్లారు. గ్రామస్థుల కథనం ప్రకారం మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో గ్రామంలోకి ప్రవేశించిన యువతులు పలువురి ఇళ్లకు వెళ్లి చందాలు వసూలు చేశారు. అయితే ఎవరికీ రసీదు ఇవ్వలేదు. గజ్జెల్లి భూదవ్వ ఇంటికివెళ్లి చందారాయాలని అడిగి లోనికి చొరబడ్డారు. నోట్లో గుడ్డలు కుక్కి మెడపై ఉన్న ఏడుతులాల బంగారం ఎత్తుకెళ్లారు. బంగారం ఎత్తుకెళ్ళిన దొంగలు ఇంటి బయట గొళ్ళెంవేసి పారిపోయినట్టు బాధితురాలు తెలిపింది. పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి విచారణ జరిపారు. గ్రామంలోని పలు సీసీ కెమెరాల్లో రికార్డైన పుటేజీనిపోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా బంగారం ఎత్తుకెళ్లిన యువతులు కోరుట్ల పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది.

రూ.3 వేల విలువైన మద్యం స్వాధీనం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం అగ్రహారం గ్రామంలో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి మద్యం అమ్ముతున్నారనే సమాచారంతో ఎస్ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. విక్రయించేందుకు నిల్వ చేసిన రూ.3 వేల విలువైన మద్యం స్వాధీనపర్చుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామని ఎస్ఐ రమాకాంత్ పేర్కొన్నారు. ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించి మద్యం అమ్మకాలు సాగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామంలో మద్యం విక్రయాలపై తమకు సమాచారం అందిస్తే వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ రమాకాంత్ పేర్కొన్నారు.

రైలు ఢీకొని మృతి చెందిన వృద్ధుడి గుర్తింపు

సుల్తానాబాద్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని సాంబయ్యపల్లి గ్రామ పరిధిలో రైలు ఢీకొని మృతి చెందిన వృద్ధుడిని గుర్తించినట్టు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 9న సోమవారం కరీంనగర్- సుల్తానాబాద్ రైల్వేలైన్‌పై సాంబయ్యపల్లి వద్ద పట్టాలు దాటుతున్న వృద్ధుడిని కరీం నగర్ తిరుపతి వెళ్లే రైలు ఢీకొంది. వృద్ధుడి వివరాలు తెలియరాలేదు. బుధవారం మృతుడి కుటుంబ సభ్యులు గుర్తించి తమకు సమాచారం ఇచ్చారని తెలిపారు. కరీంనగర్ ఇరుకుల్ల గ్రామానికి చెందిన ఎగుర్ల లింగయ్య(74)గా గుర్తించామన్నారు. ఇతను మానకొండూరు మండలం లక్ష్మీపురం గ్రామంలోని తన అక్క రాజమ్మను చూడడానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

● ఇద్దరి మృతితో పోతిరెడ్డిపేటలో విషాదం



జూపాక శ్రీహరి(ఫైల్)

హుజూరాబాద్ రూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): స్నేహితులిద్దరూ కలిసి సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లగా, మృత్యువు వారిని కాలువ రూపంలో కబళించింది. ఈ సంఘటన పోతిరెడ్డిపేట గ్రామంలో విషాదం నింపింది. గ్రామస్థులు, కుటుం బసభ్యులు తెలిపినవివరాల ప్రకారం.. జూపాక శ్రీహరి(45),రేణిగుంట సురేష్(30) మంగళవారం గ్రామశివారులోని ఉప కాలువలో ఈతకొట్టేందుకు వెళ్లారు. మొదట జూపాకశ్రీహరి కాలువలోకి దిగగా నీటి ప్రవాహం అధికంగా ఉండటంతో కొట్టుకొని పోయాడు. గమనించిన సురేష్ వెంటనే కాపాడే ప్రయత్నంలో నీటిలోకి దిగగా అతనుసైతం నీటిప్రవాహానికి కొట్టుకొనిపోయాడు. గమనించిన గ్రామస్థులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. కొంతమంది గ్రామయువకులు సురేష్ మృతదేహన్ని వెలికితీయగా, జూపాక శ్రీహరి మృతదేహం ఆచూకీలభ్యం కాలేదు. బుధవారం గ్రామశివారులో కాలువ వద్ద జూపాక శ్రీహరి మృతదేహం లభ్యమైంది. స్నేహితులిద్దరి మృత దేహాలను చూస్తూ కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

మెట్‌పల్లిటౌన్, ఫిబ్రవరి 12(ఆంధ్ర జ్యోతి): మెట్‌పల్లిపట్టణంలోని బోయవాడకు చెందిన ఎల్ల అన్వేష్(35)అనే వ్యక్తి కొంత కాలంగా మానసికస్థితి సరిగా లేక బుధవారం తల్లిదండ్రులపై కత్తితో దాడి చేసినట్లు మెట్‌పల్లి ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు. అన్వేష్ తల్లి ఎల్లరమాదేవిపై దాడిచేయగా మెడ, చేతిభాగంలో గాయాలుకాగా తండ్రిగంగనర్సయ్యకు ఎడమ చేతివేలు భాగాలలో తీవ్రంగా గాయలైనట్లు ఎస్ఐ తెలిపారు. తండ్రి గంగ నర్సయ్య ఫిర్యాదు మేరకు మెంటల్‌యాక్ట్, హత్యా యత్నం సెక్షన్లలో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు

రేషన్ బియ్యం పట్టివేత

వీణవంక, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో పెట్రోలింగ్ చేస్తుండగా పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న ఆటోను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఆటోలో 5క్వింటాల్ల బియ్యం లభించాయన్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఆటో డ్రైవర్, ఓనర్ గంట గణేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తిరుపతి తెలిపారు.

రేషన్ బియ్యం కొనుగోలు చేస్తున్న మహిళ అరెస్టు

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రహీంఖాన్‌పేట గ్రామంలో ప్రజల నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్న గంట సమ్మవ్వను అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం.. కొనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామా నికి చెందిన సమ్మవ్వ బుధవారం నిబంధనలకు విరుద్ధంగా పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేస్తుండగా పట్టుకొని ఆమె వద్ద ఉన్న 1.5 క్వింటాళ్ళ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

బస్ షెల్టర్ నిర్మించరూ..

● బస్సు కోసం రోడ్డు పైనే పడిగాపులు ●గన్నేరువరం మండల కేంద్రంలో ప్రయాణికుల కష్టాలు



మండల కేంద్రంలో రోడ్డు పక్కన ఓ షాపు మెట్ల పైన కూర్చొని బస్సు కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

గన్నేరువరం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే పారువెల్ల, యాస్వాడ, చొక్కారావుపల్లి, మైలారం గ్రామాలకు వెళ్లే నాలుగు రోడ్ల ప్రధానకూడలివద్ద బస్సుషెల్టర్ కరువైంది. దీంతో ప్రయాణికులు ఎండైనా, వానయినా రోడ్డు పక్కన ఉన్న పలుదుకాణాలను ఆశ్రయిస్తున్నారు. బస్సులకోసం గంటల తరబడి వేచిఉండే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. మండల కేంద్రంలో బస్టాండ్ లేకపోవడంతో నిత్యంవందలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వచ్చినప్పుడు వారిబాధ వర్ణనాతీతం. దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు తమసామగ్రితో వేచి ఉండడానికి స్థలంలేక రోడ్డుపక్కన ఉన్న పలు దుకాణాల మెట్లపైన పెడుతూ నానాఅవస్థలు పడుతున్నారు. దుకాణాలు, హోటల్‌లవద్ద వేచి ఉంటే యజమానులు పక్కకువెళ్లాలని చెబుతున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాలుగురోడ్ల ప్రధానకూడలి వద్ద బస్‌షెల్టర్ నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

గొర్రెగుండం అటవీ ప్రాంతంలో కలవరం

●పులి సంచారం వదంతులతో గ్రామస్థుల్లో భయాందోళన

మల్యాల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం గొర్రెగుండం అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తున్నట్లు వదంతులు రావడం స్థానికులను కలవరానికి గురి చేస్తోంది. కొడిమ్యాల మండలం శనివారంపేట నుంచి గొర్రెగుండం వచ్చే మార్గంలో మంగళవారం మనుబోతును పులి చంపి తిన్నట్లు వచ్చిన వదంతులతో ఈప్రాంతవాసులు ఆందోళన చెందుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీఅధికారులు మంగళవారం రాత్రి గ్రామంలో దప్పుచాటింపు చేయించారు. రైతులు వ్యవసాయ క్షేత్రాలకు ఒంటరిగా వెళ్లకూడదని సూచించారు. మనుబోతు మృతదేహం గల ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ విషయమై కొడిమ్యాల ఫారెస్ట్ రెంజర్ మొయినుద్దీన్‌ను సంప్రదించగా మనుబోతును చంపి తిన్నది పులి కాదని పులి అయితే తలపై దాడి చేస్తుందని అయితే మనుబోతు వెనుక వైపు గాయాలు కనిపించాయని తెలిపారు. మనోబోతు వ్యాధితో మృతి చెందితే కుక్కలు పీక్కుతున్నట్లు అనిపిస్తోందన్నారు. సీసీ కెమెరాలను పరిశీలించగా పులి సంచారం, చంపినట్లు ఎలాంటి ఆనవాళ్లు కనిపించలేదని ఆయన తెలిపారు.

విద్యుదాఘాతంతో నెమలి మృతి

తిమ్మాపూర్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండ లంలోని రామకృష్ణకాలనీలోని ఉపగ్న హోమ్స్ వద్ద బుధవారం సాయంత్రం ఓ నెమలి విద్యుదాఘాతంతో మృతి చెందింది. నెమలి పైకి ఎగిరే క్రమంలో విద్యుత్ వైర్లు తగిలి మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. రోడ్డు వెళ్తున్న గ్రామస్థులు గమనించి వెంటనే అటవీ శాఖాధికారులకు సమాచారం అందించినట్లు తెలిపారు.

ఇల్లు విక్రయం పేరిట రూ.16.35 లక్షలు స్వాహా

● నకిలీ న్యాయవాదితో పాటు ముగ్గురి అరెస్టు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని జేపీనగర్‌కు చెందిన మచ్చ నారాయణకు తన కొడుకు డైవర్స్ కేసు కోర్టులో ఫైల్‌చేస్తానని నమ్మించిన నకిలీ న్యాయవాది అయిన ఏనుగు ఫణీందర్‌తో పాటు అతని భార్య ఆడెపు రజిత, మరో వ్యక్తి బొల్లి మార్కండేయలను అరెస్టుచేసినట్లు టౌన్ సీఐకృష్ణ తెలిపారు. సిరిసిల్లపట్టణం ఆటోనగర్‌కు చెందిన ఏనుగు ఫణీందర్ అనే నకిలీ న్యాయవాది మచ్చనారాయణ, అతని కుమారుడి విడాకుల కేసు వేస్తానని దగ్గరై ఇల్లు కొనుగోలు చేసినట్లు సంతకాలు తీసుకుని మోసం చేసాడన్నారు. ఇల్లు ఖాళీ చేయాలని బాధితులను వేధించడంతో బలవంతంగా నారాయణ వద్ద నుంచి 16.35 లక్షలు వసూలు చేశాడని సీఐ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి ముగ్గురుని అరెస్టు చేసి రిమాండుకు తరలించామన్నారు. ఫణీందర్ బాధితులు ఎవరైనా ఉంటే పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావద్దు

చొప్పదండి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దని కరీంనగర్‌రూరల్ ఎక్సైజ్ ఎస్ఐ విజయభాస్కర్ అన్నారు. మంగళవారం రుక్మాపూర్ మోడల్ స్కూల్‌లో మత్తుపదార్థాలతో కలిగే దుష్ప్రభావాలపైన నిర్వహించిన అవగాహనసదస్సులో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాల వలన విద్యార్థుల భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్, ఉపాధ్యాయులు, ఎక్సైజ్‌సిబ్బంది పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో..
ఎస్ఆర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



జేఈఈ మెయిన్ పరీక్షల్లో సత్తా చాటిన ఎస్ఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులతో జోనల్ ఇన్‌ఛార్జి తిరుపతి

తిమ్మాపూర్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్ 2025 ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ చాటారని విద్యాసంస్థల జోనల్ ఇన్‌ఛార్జి నేదూరి తిరుపతి అన్నారు. అల్గునూర్‌లో ఎస్సార్ జూనియర్ కళాశాలలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాసంస్థకు చెందిన 150మంది విద్యార్థులు జాతీయస్థాయిలో మంచి పర్సంటైల్ సాధించారన్నారు. మెయిన్స్‌లో కొల్లూరి హాసిని, గోవిందారపు శివసాయి, ముదిగంటి రుశిశ్వర్‌రెడ్డి, దయ్యాల రాజ్‌కుమార్, పోగుల ఆశ్రిత, జవాజ సహస్ర, దొనకొండ సాయి, మేకల సంజన, చరణ్‌జోషి, కటకం శ్రీలేఖ 90 శాతానికిపైగా పర్సంటైల్ సాధించారన్నారు. కార్యక్రమంలో అకాడమిక్ డీన్స్ అశోక్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్స్ నాగర్జునరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, మారుతి, నరోత్తమ్‌రెడ్డి, హిహెచ్‌ప్రవీణ్‌రెడ్డి, ఏవో లక్ష్మీప్రసాద్ విద్యార్థులు పాల్గొన్నారు.

వేములవాడ రాజన్నకు
యూఎస్‌ఏ భక్తురాలు మొక్కులు



భర్తతో కలిసి రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకుంటున్న యూఎస్ఏ భక్తురాలు పీటర్

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారికి యూఎస్‌ఏకు చెందిన పీటర్ అనే భక్తురాలు మొక్కులు చెల్లించుకుంది. హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన వీరభద్రరావు అనేవ్యక్తిని వివాహం చేసుకుంది. ఈ సందర్భంగా శ్రీస్వామివారిని బుధవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి పీటర్ దర్శించుకుని కోడెమొక్కు చెల్లించుకుంది. తాము కుటుంబసభ్యులతో కలిసి యూఎస్ఏలోని సెటిల్ అయినట్లు తెలిపారు. తమ ఇంటి ఇలవేల్పు కావడంతోనే రాజన్న ఆలయానికి వచ్చినట్లు వీరభద్రరావు పేర్కొన్నారు.

అంజన్న భక్తుల గిరి ప్రదక్షిణ

మల్యాల, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రతి పౌర్ణమి రోజు కొండగట్టు అంజనేయస్వామి గిరులచుట్టూ నిర్వహిస్తున్న గిరిప్రదక్షిణ బుధవారం నిర్వహించారు. హైదరాబాద్ చిలుకూరు బాలాజీ ఆలయంలోని శివాలయం ప్రధానర్చకుడు సురేశ్ ఆత్మారాం మహారాజ్ ఆధ్వర్యంలో 25వసారి నిర్వహించిన ఈ గిరిప్రదిక్షణ నూతన మార్గంలో సాగింది. కొండగట్టు గుట్టచుట్టూ ప్రదక్షిణ కోసం మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఇటీవల రూ.3లక్షలు సొంతంగా అందించగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సహకారంతో మార్గం ఇటీవల పూర్తి అయింది. దీంతో బుధవారం ఈ మార్గంలో వందలాది మంది భక్తులు దిగువ కొండగట్టులో పూజలు నిర్వహించి ప్రదక్షిణ ప్రారంభించారు. అనంతరం కొండపైన స్వామి వారిని దర్శించుకున్నారు.



పూజలు చేస్తున్న భక్తులు

నైపుణ్యాల అభివృద్ధి..
భవితకు మార్గదర్శి

- డిగ్రీ విద్యార్థులకు వరంగా మారిన టీఎస్‌కేసీ
- ఐటీ, నాన్ ఐటీ, బ్యాంకింగ్ ఉద్యోగాలకు విద్యార్థుల ఎంపిక



ఇవి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు శిక్షణ

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోని పేద విద్యార్థులకు కమ్యూనికేషన్స్ స్కిల్స్‌పై శిక్షణ ఇవ్వడంతో పాటు వారి భవితకు మార్గదర్శిగా నిలుస్తోంది తెలంగాణ స్కిల్ అండ్ నాలెడ్జ్ సెంటర్ (టీఎస్‌కేసీ). గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని పేద విద్యార్థులకు టీఎస్‌కేసీ వరంగా మారింది. సమైక్యాంధ్ర రాష్ట్రంలో 2005లో జవహర్‌లాల్ నాలెడ్జ్ సెంటర్‌గా ప్రారంభమైనప్పటికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత 2014 నుంచి టీఎస్‌కేసీగా మారింది. విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ తరగతులు నిర్వహించి వారికి కావాల్సిన మెటీరియల్ అందిస్తూ కొలువులు పొందే విధంగా టీఎస్‌కేసీ కృషి చేస్తోంది. డిగ్రీలోని బీకాం(జనరల్), బీకాం కంప్యూటర్స్, బీఏ, బీఎస్సీ తదితర గ్రూపుల్లోని విద్యార్థులకు రెగ్యులర్ క్లాసులతోపాటు మూడు నెలల పాటు అన్ని గ్రూపుల విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నది.

● ప్రభుత్వ కళాశాలకే కంపెనీలు

సాధారణంగా ఇంజనీరింగ్ కళాశాలల్లో కంపెనీలు క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించి విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాయి. డిగ్రీ విద్యార్థులకు ఆ అవకాశం లేదు. దీంతో ప్రభుత్వం టీఎస్‌కేసీ ద్వారా అవకాశం కల్పిస్తోంది. డిగ్రీ విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్ అండ్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ ఇచ్చి పలు కంపెనీలు జాబ్‌మేళాలు నిర్వహించేలా చూస్తోంది. ఇప్పటి వరకు ఐటీ, నాన్‌ఐటీ, బ్యాంకింగ్, ఫార్మా కంపెనీలలో విద్యార్థులు డిగ్రీ పూర్తికాగానే ఉద్యోగం సాధించారు



జాబ్‌మేళాలో ఎంపికైన విద్యార్థులు

● అనుభవజ్ఞులతో శిక్షణ

టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో కమ్యూనికేషన్ స్కిల్ డెవలప్‌మెంట్‌తోపాటు, రీజనింగ్ అండ్ యాటిట్యూడ్, జనరల్ ఇంగ్లీష్, సామాజిక అంశాలపై అవగాహన, కరెంట్ ఎఫైర్స్, కంప్యూటర్ స్కిల్స్‌పై అనుభవజ్ఞులతో శిక్షణ ఇస్తారు. స్టేజ్ ఫియర్ ఎదుర్కోవడం, ఇంటర్వ్యూల భయం పోగొట్టేందుకు మాక్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. హైదరాబాద్, బెంగళూర్, పూణే ప్రాంతాల నుంచి ట్రైనర్స్‌ను తీసుకువచ్చి శిక్షణ ఇస్తున్నారు.

● టాస్క్‌తో మరో అడుగు...

తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్స్ అండ్ నాలెడ్జ్(టాస్క్)తో డిగ్రీ విద్యార్థుల భవితకు మరో అడుగు ముందుకు వేసింది. హైదరాబాద్, బెంగుళూర్ వంటి ప్రాంతాలకు వెళ్లి రూ. 30 వేల నుంచి రూ. 50 వేల వరకు పెట్టి చదివే స్తోమత లేని రూరల్ ఏరియా డిగ్రీ విద్యార్థులను ప్రోత్సహించేందుకు టాస్క్ ఉచితంగా పలు కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నది. మొదట విద్యార్థులు టాస్క్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. కళాశాలలో ప్రత్యేకంగా ట్రైనర్ శిక్షణ ఇస్తారు. బీటెక్ చదివిన వారితో సమానంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నది. పోటీ పరీక్షలకు సంబంధించిన వివరాలను తెలియజేయడంతో పాటు వాటికి సంబంధించిన మెటీరియల్స్‌ను ఇస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నది.

విద్యార్థులకు ప్రయోజనం

- డాక్టర్ జైకిషన్ ఓజా, ప్రిన్సిపల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గోదావరిఖని



టీఎస్‌కేసీ, టాస్క్‌తో ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఎంతో ప్రయోజనం. రెగ్యూలర్ సిలబస్‌తోపాటు టీఎస్‌కేసీ ద్వారా ప్రత్యేకంగా తరగతులు నిర్వహిస్తున్నాం. వివిధ ప్రాంతాల నుంచి ట్రైనర్స్ వచ్చి ప్రైవేట్ కంపెనీలలో ఏవిధంగా ఇంటర్వ్యూలను ఎదుర్కోవాలి, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ తదితర అంశాలపై థియరీ తరగతులతోపాటు మాక్ ఇంటర్వ్యూలు నిర్వహించి జాబ్‌మేళాలను నిర్వహిస్తుంది.

● పేద విద్యార్థుల ఉపాధి కల్పనకు

- డాక్టర్ జి సుబ్బారావు, కోఆర్డినేటర్, టీఎస్‌కేసీ, టాస్క్ ప్రభుత్వ డిగ్రీకళాశాల, గోదావరిఖని



పేద విద్యార్థులకు ఉద్యోగాల కల్పించేందుకు వారికి కావాల్సిన కమ్యూనికేషన్స్ స్కిల్ తదితర అంశాలపై టీఎస్‌కేసీ శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించే కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఈ బాధ్యతను నిర్వహించడం గౌరవంగా భావిస్తున్నా. శిక్షణ ఇవ్వడం, ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలు కల్పించే క్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, టీఎస్‌కేసీ అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు.

టీఎస్‌కేసీ కెరియర్‌కు ఎంతో దోహదపడింది.

- రుక్షిత, ఎన్‌టీపీసీ



2021లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ, 2023లో కాకతీయ యూనివర్సిటీలో పీజీ పూర్తి చేశాను. టీఎస్‌కేసీ ద్వారా తీసుకున్న శిక్షణ నా కెరియర్‌కు ఎంతో దోహదపడింది. ప్రస్తుతం కిమ్స్ ఆసుపత్రిలో లాబోరేటరీ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేస్తున్నాను. టాస్క్ ద్వారా కమ్యూనికేషన్ స్కిల్స్, రీజనింగ్, అర్థమెటిక్స్ చాలా ఉపయోగపడ్డాయి.

సీఐఎస్‌ఎఫ్ కానిస్టేబుల్‌గా చేస్తున్నా..

- జక్కుల ప్రేమ్‌సాయి, గోదావరిఖని



గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2017-2020లో బీఎస్సీ ఎంపీసీఎస్ పూర్తి చేశాను. టీఎస్‌కేసీ ద్వారా తీసుకున్న శిక్షణ నాకు ఎంతో ఉపయోగపడింది. ప్రస్తుతం సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా ఛత్తీస్‌గఢ్ దంతేవాడలో పనిచేస్తున్నా. టీఎస్‌కేసీ నా కెరియర్ అభివృద్ధికి చాలా ఉపయోగపడింది.

భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

- మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను పరిశీలించిన వేములవాడ రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ కల్చరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్ర జ్యోతి): వేములవాడలో ఈనెల 25వ తేది నుంచి 27వ వరకు నిర్వహించే మహాశివరాత్రి జాతరను అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని, గత సంవత్సరం మహాశివరాత్రి జాతరలో భక్తులకు ఇబ్బందులు తలెత్తిన సమస్యలను పరిష్కరించుకుని ముందుకు సాగుతామని రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి అన్నారు. మహాశివరాత్రి సందర్భంగా రాజన్న ఆలయపరిసరాల్లో నిర్వహించే కోడె క్యూలైన్, ఉచితటిఫిన్, భోజనం, లడ్డూ కౌంటర్, సులభ్ కాంప్లెక్స్ పార్కింగ్ ఏరియా, చలువ పందిళ్ల ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా ఈవో మాట్లాడుతూ ఈనెల 25,26,27వ తేదిల్లో నిర్వహించే మహాశివరాత్రి జాతరకు భక్తులు పెద్దసంఖ్యలో రానున్నారని తెలిపారు. సుమారు నాలుగు లక్షల మంది వరకు భక్తులు రానున్నారని అన్నారు. రాజన్న ఆలయానికి వచ్చే సామాన్య భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లను దగ్గరుండి చూసుకోవాలని అన్నారు. గతంలో జరిగిన ఇబ్బందులు ఏమైనాఉంటే వాటినిసరి దిద్దుకుని ముందుకుసాగాలని సూచించారు. భక్తులకు అన్ని రకాల సౌకర్యాలనుఅందుబాటులో తీసుకువచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. భక్తులు శ్రీస్వామివారిని దర్శించుకునే సమయంలో క్యూలైన్‌లోఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మహాశివరాత్రిని వైభవంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులసమన్వయంతో ముందుకువెళుతున్నామని తెలిపారు. ఆయనవెంట ఈఈ రాజేష్, డీఈ రఘునందర్, ఏఈవోశ్రావణ్ పర్యవేక్షకులు వరినర్సయ్య, సంజీవరావు తదితరులు ఉన్నారు.



క్యూలైన్‌లను పరిశీలిస్తున్న రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి

ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ నిల్

- నేటితో ముగియనున్న గడువు

కరీంనగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారంతో ముగియనుందని, బుధవారం అభ్యర్థులెవరూ ఉపసంహరించుకోలేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. పట్టభద్రుల నియోజకవర్గంలో 100 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారని, పరిశీలనలో 32 మంది నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయని, 68మంది అభ్యర్థులు ఉన్నారని తెలిపారు. ఉపాధ్యాయ నియోజకవర్గానికి సంబంధించి 17మంది నామినేషన్లు దాఖలు చేయగా ఒకరినామినేషన్ తిరస్కరణకు గురైందని, 16మంది నామినేషన్లు సరిగా ఉన్నట్లు ప్రకటించామని పేర్కొన్నారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు గురువారం మధ్యాహ్నం 3గంటలకు ముగియనున్నట్లు వెల్లడించారు.

- మల్కపేట జలాశయం నుంచి సాగు నీటి విడుదలకు సన్నాహాలు
- 9వ ప్యాకేజీ కాల్వ పనులు ముమ్మరం
- అన్నదాతల్లో ఆనందం

మెట్ట ప్రాంతానికి గోదావరి జలాలు



కాల్వలోని ముళ్లపొదలను తొలగిస్తున్న ట్రాక్టర్

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రెండుమూడు రోజుల్లో మెట్ట ప్రాంతానికి గోదావరి జలాలు చేరుకోనున్నాయి. ఇందుకోసం అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. శ్రీరాజరాజేశ్వర జలాశయం నుంచి ఎగువ మానేరు జలాశయం వరకు చేపట్టిన తొమ్మిదవ ప్యాకేజీ కాల్వ ద్వారా సాగు నీటిని అందించి పంటలు ఎండిపోకుండా చూడాలని ఇటీవల రైతులు వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాలకు విజ్ఞప్తి చేశారు. దీంతో స్పందించిన సర్కారు మల్కపేట జలాశయం నుంచి 9వ ప్యాకేజీ కాల్వ ద్వారా సాగు నీటిని విడుదల చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించింది. నీటి పారుదల శాఖ అధికారులు కాల్వల్లోని ముళ్ల పొదలు, మరమ్మతు పనులను ముమ్మరం చేశారు. రెండు రోజుల్లో పనులు పూర్తిచేసి మెట్ట ప్రాంతానికి గోదావరి జలాలు అందించేలా సన్నాహాలు చేస్తున్నారు. సాగునీరు విడుదల చేస్తారనే సమాచారంతో అన్నదాతల్లో ఆనందం వ్యక్తం అవుతోంది.

● యుద్ధ ప్రాతిపదికన పనులు

గత వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని నీటి వనరులన్నీ నిండాయి. దాంతో సుమారు 16850 ఎకరాల విస్తీర్ణంలో రైతులు వరి పంటలను సాగుచేశారని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఎండలు ముదరడంతో నీటి వనరుల్లో నీరు తగ్గిపోయింది. బోరుబావులు సైతం ఏకదాటిగా నీరు పోయకపోవడం వల్ల మండలంలోని బుగ్గరాజేశ్వరతండా, దేవునిగుట్టతండా, రాచర్లగొల్లపల్లి, తిమ్మాపూర్, అక్కపల్లి తదితర గ్రామాల్లో సాగు చేసిన వరి పంటలు పగుళ్ల బారుతున్నారు. కళ్ల ముందే 400 ఎకరాల విస్తీర్ణంలోని పొలాలు ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. 9వ ప్యాకేజీ కాల్వ ద్వారా సాగు నీటిని అందించి పంటలను రక్షించాలని కోరుతున్నారు. కాంగ్రెస్ నాయకులు, రైతులు ఇటీవల ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సర్కారు మల్కపేట జలాశయం నుంచి 9వ ప్యాకేజీ కాల్వ ద్వారా సాగు నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. దీంతో నీటి పారుదల శాఖ అధికారులు పనులను ముమ్మరం చేశారు. సుమారు 18.3 కిలోమీటర్ల పొడవు ఉన్న కాలువలో ముళ్లపొదలు, చెత్తాచెదారం తొలగిస్తున్నారు. రెండు రోజుల్లో నీటిని విడుదల చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. దీంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

పంటలు ఎండిపోకుండా చూడాలి..

- ప్రభునాయక్, రైతు, కిష్టునాయక్‌తండా



నాకున్న మూడు ఎకరాల్లో వరి పంటను సాగు చేశా. బోరు బావుల్లో నీరు అడుగంటడం వల్ల పొలానికి నీరు అందడం లేదు. ఎకరం పొలం పగుళ్ల చూపింది. 9వ ప్యాకేజీ కాల్వ ద్వారా నీటిని విడుదల చేసి పంటలు ఎండిపోకుండా చూడాలి.

సాగు నీటిని అందించాలని విన్నవించాం..

- దొమ్మాటి నర్సయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు



మండలంలోని పలు గ్రామాల్లో సాగు చేసిన వరి పొలాలు పగుళ్ల చూపుతున్నాయని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిల దృష్టికి తీసుకెళ్లాం. స్పందించిన వారు ప్రభుత్వానికి నివేదించారు. మల్కపేట జలాశయం నుంచి 9వ ప్యాకేజీ కాల్వ ద్వారా నీటి అందించి పొలాలు ఎండిపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

నీటి విడుదలకు ఏర్పాట్లు చేస్తున్నాం

- కిషోర్, ఈఈ, 9వ ప్యాకేజీ

మల్కపేట జలాశయం నుంచి ఎగువ మానేరు జలాశయం వరకు 9వ ప్యాకేజీ కాల్వ ద్వారా సాగు నీరును అందించేందుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఉన్నతాధికారులు ప్రభుత్వానికి నివేదించారు. మల్కపేట జలాశయంలో 1 టీఎంసీ నీరు నిల్వ ఉంది. ఎగువ మానేరు జలాశయం వరకు నీటిని విడుదల చేయాలంటే శ్రీ రాజరాజేశ్వర జలాశయం నుంచి మరో 0.5 టీఎంసీ నీరు అవసరం ఉంటుంది. అందుకు ప్రభుత్వ అనుమతి తీసుకునేలా ఉన్నతాధికారులు చర్యలు చేపడుతున్నారు. 9వ ప్యాకేజీ కాల్వను శుభ్రంచేయడంతో పాటు మట్టిని తొలగించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేస్తున్నాం.

రాష్ట్రస్థాయి వైజ్ఞానిక సదస్సుకు
ప్రధానోపాధ్యాయుడి ఎంపిక



అభయ్‌రాజ్

రాయికల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ వైజ్ఞానిక దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర=స్థాయి సైన్స్‌సదస్సుకు మండలంలోని కుమ్మరిపెల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కడకుంట్ల అభయ్‌రాజ్ ఎంపికైనట్లు జిల్లాసైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్ తెలిపారు. “మనచుట్టూ ఉన్న ప్రపంచంలో విజ్ఞానశాస్త్రం” అనేఅంశంపై రాష్ట్రవ్యాప్తంగా పరిశోధనాపత్రాలు ఆహ్వానించగా జగిత్యాల జిల్లా నుంచి అభయ్‌రాజ్ రూపొందించిన పరిశోధనాపత్రం ఎంపికైంది. ఈనెల 28న రాష్ట్ర విద్యాశిక్షణా పరిశోధనాసంస్థలో రూపొందించిన “ప్రయోగశాలగా వంటశాల” పరిశోధనా పత్రం ప్రదర్శించనున్నారు. ఈ సందర్భంగా అభయ్ రాజ్‌ను జిల్లా విద్యాధికారి కె.రాము, మండల విద్యాధికారి శ్రీపతి రాఘవులు, పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం రమేష్, మండల అధ్యక్షుడు అంతడుపుల గంగరాజం, ప్రధాన కార్యదర్శి రాపర్తి నర్సయ్య తదితరులు అభినందించారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

జగిత్యాలరూరల్, జనవరి 12 (ఆంధ్ర జ్యోతి): జగిత్యాల మండలం అంబారిపేట, తాటిపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో బుధవారం శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణమహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృత అభిషేకం తదితర వైదికక్రతువులు నిర్వహించారు. జగిత్యాలమండలం అంబారిపేట గ్రామంలోని శ్రీవెంకటేశ్వర ఆలయమందు మొదటిసారిగా గిరిప్రదక్షిణ ప్రారంభించారు. స్వామివారి నామస్మరణతో ఆలయమంతా మారుమ్రోగింది.

సంక్షిప్తంగా..

గణేశ్‌నగర్: నగరంలోని టవర్ సర్కిల్ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహించిన బ్రహ్మోత్సవాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా సేవలందించిన సందర్భంగా సిబ్బందిని బుధవారం కరీంనగర్ జిల్లా పర్యవేక్షక ఇంజినీర్ రమేష్‌బాబు, డివిజనల్ ఇంజినీర్ జంపాల రాజం సన్మానించారు.

కరీంనగర్ కల్చరల్: మాస్క్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు 12 ఆదివారాలు ఉచితంగా నిర్వహించిన రోల్ ప్లే శిక్షణ పూర్తయిన సందర్భంగా శనివారం సాయంత్రం 5 గంటల నుంచి కళాభారతిలో చిల్డ్రన్ థియేటర్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్లు ఇనిస్టిట్యూట్ చైర్మన్, రోల్‌ప్లే ట్రైనర్ అనసూరి భూనాథాచారి ఒక ప్రకటనలో తెలిపారు.

కరీంనగర్ రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఎంఈవో రవీందర్ తనిఖీ చేశారు. అనంతరం భవిత కేంద్రాన్ని సందర్శించారు.

గణేశ్‌నగర్: వేసవి దృష్ట్యా టౌన్-1 కరీంనగర్ సెక్షన్‌లో మూడు 100 కేవీఏ ట్రాన్స్ ఫార్మర్‌లు, ఒక 160 కేవీఏ ట్రాన్స్ ఫార్మర్, ఒక 63 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ మొత్తం 5 ట్రాన్స్ ఫార్మర్లను బుధవారం చార్జ్ చేశారు. పర్యవేక్షక ఇంజినీర్ రమేష్ బాబు, డివిజనల్ ఇంజినీర్ జంపాల రాజం, ఏడీఈ టౌన్-1 శ్రీనివాస్ గౌడ్, ఏఈ టౌన్-1 శ్రీనివాస్ ఉన్నారు.

భగత్‌నగర్: అంబేద్కర్ స్టేడియంలో నిర్వహిస్తున్న స్వదేశీ మేళా, నేషనల్ లెవల్ స్పోర్ట్స్ కాంపిటిషన్‌లో సరస్వతీ శిశు మందిర్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాఠశాల అధ్యక్షుడు బల్మూరి కరుణాకర్ రావు, కార్యదర్శి ఇంజనీర్ అన్నారెడ్డి, గంగాధర్, సమితి కార్యదర్శి సత్యనారాయణ, డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, రాపర్తి శ్రీనివాస్, రాజేశ్వర్‌రావు, ప్రధానాచార్యులు రాజమౌళిహర్షం వ్యక్తం చేశారు.

గణేశ్‌నగర్ : శాతవాహన విశ్వ విద్యాలయంలో వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో బుధవారం డిగ్రీ, పీజీ అధ్యాపకులకు 'రీసెర్చ్ మెథడాలజీ, ప్రాజెక్ట్ రిపోర్ట్' అనే అంశంపై ఒక రోజు సదస్సు నిర్వహించారు. ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ మాట్లాడారు. అధ్యాపకులు నిత్యం కొత్త అంశాలను నేర్చుకోవాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన అన్ని అంశాలను అవగాహన చేసుకోవాలన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై చర్యలు శూన్యం

- చేగుర్తి వాగు నుంచి యథేచ్ఛగా తరలింపు
- అధికారులకు గ్రామస్థుల ఫిర్యాదు


కమాన్‌ను ధ్వంసం చేసిన ఇసుక అక్రమ రవాణాదారులు

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం చేగుర్తిలో ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా అక్రమదారులు యథేచ్ఛగా ఇసుకను తరలిస్తున్నారు. మరో వైపు ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు గ్రామస్థులు ఎన్ని చర్యలు చేపట్టినా ఫలితం లేకుండా పోతోంది. ఇసుక ట్రాక్టర్లను అడ్డుకునేందుకు శివారులో గ్రామస్థులు ఇనుప పైపులతో కమాన్ ఏర్పాటు చేశారు. దాన్ని ధ్వంసం చేసి అక్రమదారులు ఇసుక తరలిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇసుక రవాణాతో పంటలు దెబ్బతింటున్నాయని, రోడ్లు ధ్వంసం అవుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. వాగులో నుంచి ఇసుక తీయడంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. ట్రాక్టర్ల అతివేగంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

● గ్రామ కార్యాదర్శికి ఫిర్యాదు

ఇసుక అక్రమ రవాణను అరికట్టాలని గ్రామ కార్యదర్శికి గ్రామస్థులు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సంబంధిత రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు కార్యదర్శి తెలిపారు.

ఐఐటీ జేఈఈ మెయిన్స్‌లో 'ట్రినిటీ' విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ట్రినిటీ విద్యాసంస్థల అధినేత దాసరి మనోహర్‌రెడ్డి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఐఐటీ జేఈఈ మెయిన్స్-25 ఫస్ట్ సెషన్‌లో ట్రినిటీ విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా కరీంనగర్‌లోని ట్రినిటీ జూనియర్ కళాశాల ప్రైమ్ క్యాంపస్‌లో బుధవారం ట్రినిటీ విద్యాసంస్థల వ్యవస్థాపక అధ్యక్షుడు దాసరి మనోహర్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జేఈఈ మెయిన్స్ ఫస్ట్ సెషన్ ఫలితాల్లో వి.రామ్‌చరణ్ 99.49 పర్సంటైల్, కె.భవేష్ 98.75, బి.సిద్ధిఖి 98.72, వి.సుధీష్ 97.61, మ్యాథ్స్ విభాగంలో వి.రాంచరణ్ 99.34, వి.సుధీష్ 99.00, అసీఫియా నోరిస్ 98.50, వి.వెంకటకృష్ణ 98.43, ఎల్.తిరుపతి నాయక్ 98.19, షేక్ బషీరుద్దీన్ 97.47 పర్సంటైల్ సాధించారని తెలిపారు. ట్రినిటీ విద్యాసంస్థల్లో అందించే ప్రత్యేక శిక్షణ, సీనియర్ అధ్యాపకుల మార్గదర్శకాలు, అభ్యాసం ద్వారా మాత్రమే ఈ అద్భుత ఫలితాలు వచ్చాయన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): నగరంలో విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా గురువారం ఉదయం 8:30 నుంచి 11:30 వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ వన్ ఏడీఈ శ్రీనివాస్ గౌడ్ ప్రకటనలో తెలిపారు. జానకి చికెన్‌సెంటర్, రామాలయం,ఇంద్రానగర్, ప్రశాంత్‌నగర్, రేని ఆస్పత్రి ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

మహిళా ఖైదీలకు ఆరోగ్య పరీక్షలు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా జైలులో మహిళా ఖైదీలకు బుధవారం జైలు సూపరింటెండెంట్ విజయ్ డేని ఆధ్వర్యంలో ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. జైలు సిబ్బంది మహిళా కుటుంబ సభ్యులకు కూడా ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా జైలు మెడికల్ ఆఫీసర్ వేణుగోపాల్, డాక్టర్లు అలీం, ఇనాయిని, కె.సాత్విక ప్రసాద్, సీహెచ్ మేఘన, మానస, ఝాన్సీ, జైలర్ పి.శ్రీనివాస్, డిప్యూటీ జైలర్లు ఎ.శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.సుధాకర్‌రెడ్డి, ఎల్.రమేష్ పాల్గొన్నారు.

'మా ఊరి తామరలు' పుస్తకావిష్కరణ

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక విద్యారణ్యపురిలోని సూర్య రెసిడెన్సీలో తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన 142వ ఎన్నీల ముచ్చట్ల కార్యక్రమంలో దామరకుంట శంకరయ్య రచించిన 'మా ఊరి తామరలు' పుస్తకాన్ని గేయ రచయిత నడిమెట్ల రామయ్య ఆవిష్కరించారు. పుస్తకాన్ని రచయిత తన జీవిత భాగస్వామి క్రాంతికి అంకితమిచ్చారు. అనంతరం కవులు, రచయితలు తమ కవితలను వినిపించారు. ఈ కార్యక్రమంలో గాజోజు నాగభూషణం, సీవీ కుమార్, విలాసాగరం రవీందర్, ఇటిక్యాల రాము, నెరువట్ల చైతన్య, పెనుగొండ బసవేశ్వర్, మద్రిపల్లి మహేందర్, మొండయ్య, ఎండీ ఖాలీద్, కూకట్ల తిరుపతి, బూర్ల వేంకటేశ్వర్లు, వాసాల వరప్రసాద్, బాలసాని కొమురయ్య, అరుణ్, అఖిల్ పాల్గొన్నారు.

స్వదేశీ మేళాతో వ్యాపారులు, కళాకారులకు గుర్తింపు


స్టాల్స్ వద్ద స్వదేశీ జాగరణ్ మంచ్ సభ్యులు

భగత్‌నగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : స్వదేశీ మేళాతో వ్యాపారులు, కళాకారులకు గుర్తింపు లభిస్తుందని స్వాలంబ్ భారత్ అభియాన్ ప్రాంత కో-కన్వీనర్ ఇంద్రసేనారెడ్డి, స్వదేశీ జాగరణ్‌మంచ్ దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన కార్యదర్శి జగదీష్‌జీ, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ తెలంగాణ పూర్వ సంఘ్‌చాలక్ బుర్రా దక్షిణామూర్తి అన్నారు. బుధవారం అంబేద్కర్ స్టేడియంలో స్వదేశీ మేళా ప్రారంభోత్సవం సందర్భంగా మాట్లాడుతూ స్వదేశీ భావజాలంతో దేశం ఆర్థికంగా మనుగడ సాధిస్తుందన్నారు. కరీంనగర్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఐవీవై స్కూల్ చైర్మన్ పసుల మహేష్, స్వదేశీ మేళా బాధ్యులు ముక్క హరీష్‌బాబు, గంప వెంకట్, కళ్లెం వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి


మాట్లాడుతున్న జోన్ ఈడీ ఖుస్రోషాఖాన్

భగత్‌నగర్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి జాతర సందర్భంగా శైవ క్షేత్రాలకు వెళ్లే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆర్టీసీ కరీంనగర్ జోన్ ఈడీ ఖుస్రో షాఖాన్ అన్నారు. బుధవారం కరీంనగర్ ఆర్టీసీ సమావేశ మందిరంలో జోన్ పరిధిలోని ఆర్ఎంలతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడారు. భక్తులకు సరిపడా బస్సులను అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం ఎలక్ట్రిక్ బస్సుల పనితీరుపై సమీక్షించారు. రీజినల్ మేనేజర్లు సోలమన్, సరిరాం, రాజు, విజయభాను, జ్యోత్స్న, డిప్యూటీ రీజినల్ మేనేజర్లు సత్యనారాయణ, భవాని ప్రసాద్, మాధవరావు, ప్రవీణ్‌కుమార్, సరస్వతి, ప్రణీత్, భానుకిరణ్, భూపతిరెడ్డి,పవిత్ర, సుగుణాకర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ జేఏసీ ఏర్పాటు

భగత్‌నగర్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): టీజీఎస్‌ఆర్టీసీ జేఏసీ చైర్మన్‌గా ఎంపిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బుచ్చన్న యాదవ్ అధ్యక్షతన కమిటీని ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్‌గా కె.కొమురయ్య, కన్వీనర్‌గా జె. పుల్లయ్య, కో-కన్వీనర్‌లుగా డి.రాజయ్య, ఎస్. శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఆయా రీజియన్ల టీఎంయూ, ఎన్ఎంయూ, బీకేయూ, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఎస్సారార్‌లో వర్క్‌షాప్

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): శ్రీరాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ సైన్స్ కళాశాల స్వయం ప్రతిపత్తి కరీంనగర్. కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఇన్స్టిట్యూషన్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ హైదరాబాద్ సంయుక్తంగా బుధవారం పరిశోధనా పద్ధతులపై వర్క్‌షాప్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ మాట్లాడుతూ వర్క్‌షాప్‌లో నేర్చుకున్న అంశాలను నిరతంతరం మననం చేసుకోవాలని, మంచి పరిశోధకులు కావాలని ఆకాంక్షించారు. ప్రొఫెసర్ శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ డిగ్రీలో ఉన్న రీసెర్చ్ మెథడాలజీ అనే సిలబస్‌కు వర్క్‌షాప్ ఎంతగానో అవసరం అవుతుందన్నారు. వర్క్‌షాప్ కన్వీనర్ బొర్ల నరేష్‌కు అభినందనలు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ నితిన్, టి.రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన కల్పించడంలో హెల్త్ ఎడ్యుకేటర్ల పాత్ర కీలకం

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో హెల్త్ ఎడ్యుకేటర్లది కీలకపాత్రని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. తెలంగాణ రాష్ట్ర హెల్త్ ఎడ్యుకేషన్, మీడియా ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన డైరీ, క్యాలెండర్‌ను బుధవారం ఆవిష్కరించారు. డీటీసీవో డాక్టర్ రవిందర్‌రెడ్డి, ఏవో ఖాదర్, సూపరింటెండెంట్ స్వామి, అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంజాల ప్రతాప్, హెల్త్ ఎడ్యుకేటర్ కైక పాల్గొన్నారు.

ఎస్‌యూ డైరీ ఆవిష్కరణ

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం 2025 డైరీని ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్, రిజిస్ట్రార్ ఆచార్య రవికుమార్, ఓఎస్డీ టు వీసీ హరికాంత్ బుధవారం కార్యాలయంలో ఆవిష్కరించారు. ప్రిన్సిపాల్‌లు డాక్టర్ జయంతి, డాక్టర్ హరికాంత్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ రంగప్రసాద్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ ప్లాటినం జూబ్లీ వేడుకలు


వేడుకలకు హాజరైన రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ ప్లాటినం జూబ్లీ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. సబ్ స్టేషన్, సెక్షన్, సర్కిల్, యూనియన్ కార్యాలయాల్లో యూనియన్ జెండా ఎగురవేశారు. అనంతరం పూర్వ నాయకులను సన్మానించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నిమ్మ పద్మారెడ్డి, జిల్లా అధ్యక్షులు ఆకుల వీరయ్య, కన్నం నర్సింగరావు, మాజీ డిస్కం అధ్యక్షుడు నల్వాజి రమణ రావు, మహేందర్ రావు, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మాఘ పౌర్ణమి సందర్భంగా కరీంనగర్ మండలం నగునూర్‌లోని పరివార సమేత దుర్గా భవానీ దేవాలయంలో అమ్మవారికి ఆలయ ధర్మాధికారి పురాణం మహేశ్వర శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. పల్లకి, ఉయ్యాల సేవలతో పాటు సహస్ర దీపారాధన చేశారు. ఆలయ ఫౌండర్ వంగల లక్ష్మణ్, ఆలయ కమిటీ బాధ్యులు వేములవాడ ద్రోణాచారి, తిరుపతి పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు సన్మానం

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ సమైక్యత శిబిరంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లను బుధవారం ఎస్‌యూ వీసీ ఉమేష్‌కుమార్ సన్మానించారు.యువజన క్రీడా మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలోని డాక్టర్ ఏఎన్ కళాశాలలో ఈ నెల 3 నుంచి 9 వరకు జాతీయ సమైక్యత శిబిరం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ సెల్ కో-ఆర్డినేటర్ ఈ మనోహర్, డాక్టర్ కంచు తిరుపతి, డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ పడాల తిరుపతి. డాక్టర్ కాంపల్లి అర్జున్, డాక్టర్ ఎలిజబెత్ రాణి, డాక్టర్ రాజేష్ పాల్గొన్నారు.

సాన్వి కళాశాలను సందర్శించిన స్టడీమెట్రో కన్సల్టెన్సీ ఎండీ

భగత్‌నగర్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): నగరంలోని సాన్వి కళాశాలను స్టడీమెట్రో కన్సల్టెన్సీ ఎండీ అభిషేక్ బజాజ్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్, స్టడీమెట్రో ఫ్రాంఛైజీ ఓనర్ ఎర్రంశెట్టి మునీందర్ ఆయనను సన్మానించారు. అనంతరం విదేశాల్లో ఉన్నత విద్యా అవకాశాలపై విద్యార్థులు, అధ్యాపకులతో చర్చించారు.

అన్నవరం దేవేందర్ కవిత్వంపై పురుషోత్తంకు డాక్టరేట్

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోరుట్ల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో టీచర్‌గా పని చేస్తున్న మనుగూరి పురుషోత్తంకు ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటించింది. పురుషోత్తం కరీంనగర్‌కు చెందిన కవి అన్నవరం దేవేందర్ కవిత్వం-సమగ్ర అధ్యయనం అనే అంశంపై ఆచార్య గోన నాయక్ ఆధ్వర్యంలో పరిశోధన చేసి పీహెచ్‌డీ పట్టా సాధించారు. అన్నవరం దేవేందర్ రచనలు సమాజాన్ని జాగృతం చేసేలా ఉన్నాయని పురుషోత్తం తెలిపారు.

టీబీ రహిత భారత్‌లో భాగస్వాములు కావాలి

● డీటీసీవో డాక్టర్ రవీందర్‌రెడ్డి



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): టీబీ రహిత భారత్‌లో భాగస్వాములు కావాలని డీటీసీవో డాక్టర్ రవీందర్‌రెడ్డి అన్నారు. పాత మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు బుధవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా డీటీసీవో మాట్లాడుతూ పారి శుధ్య కార్మికులు ఎక్కువగా దుమ్ము, ధూళి, పొగ ఉన్న ప్రాంతాల్లో పని చేయాల్సి వస్తుందని, అలాంటి వారు టీబీ వ్యాధికి గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్‌మేనేజర్ రాజిరెడ్డి, డాక్టర్ చందన, డాక్టర్‌కార్తీక్,హెల్త్ఎడ్యుకేటర్‌మోహన్‌రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల పాట్లు


రైతులు లైన్లో పెట్టిన చెప్పులు

సైదాపూర్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): యూరియా బస్తాలు దొరుకా తాయో లేదో అని మండలంలోని వెన్నంపల్లి గ్రామంలో యూరియా కోసం రైతులు పడరానిపాట్లు పడుతున్నారు. బుధవారం వెన్నంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి యూరియా వచ్చిందని తెలిసి రైతులు ఉదయం 7గంటల నుంచే లైన్లుకట్టారు. లైన్లో ఉండలేక తమ చెప్పులు, బండ రాళ్లు, డబ్బాలు లైన్లో పెట్టి పక్కన కూర్చున్నారు. ఉదయం 10 గంటల తరువాత రైతులకు యూరియా పంపకాలు చేశారు.

ఉపాధ్యాయుడిగా మారిన మున్సిపల్ కమిషనర్

హుజూరాబాద్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పన్నుల వసూళ్లలో భాగంగా బుధవారం ఓప్రైవేట్‌పాఠశాలకు వెళ్లిన మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య ఉపాధ్యాయుడిగా మారి పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు భవిష్యత్తు పాఠాలను చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ భూపాల్‌రెడ్డి, ప్రతాపరాజు తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

శంకరపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలఅమలులో విఫలమైందని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అన్నారు. బుధవారం మండలంలో సీపీఐ కౌన్సిల్ సమావేశం మండల కార్యదర్శి పిట్టలసమ్మయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి 14నెలలు గడిచినా ఎన్నికల సమయంలో ఇచ్చినహామీల అమలులో కాంగ్రెస్‌ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రజల్లోప్రభుత్వంపై అసంతృప్తి నెలకొందన్నారు. సమావేశంలో నాయకులు కన్నం సదానందం, తాడవేణి రవి, దేవయ్య, గోదారి లక్ష్మణ్, పిట్టల రామస్వామి, బొజ్జ సాయిలు, నరేష్, సాగర్ పాల్గొన్నారు.

కన్నుల పండువగా శ్రీనివాస కల్యాణం


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగాపూర్ గ్రామంలోని శ్రీ పద్మాగోదా సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణం బుధవారం కన్నుల పండువగా జరిగింది. వేదపండితుల మంత్ర పఠనం, వ్యాఖ్యానం భక్తులను ఆకట్టుకుంది. కల్యాణోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్సవవిగ్రహాలకు, స్వామివారి అమ్మవారి మూలవిరాట్టు విగ్రహాలకు ప్రత్యేక అలంకరణ చేశారు. కల్యాణ ఘట్టాన్ని తిలకించేందుకు ఆయాగ్రామాల నుంచి భక్తులు భారీసంఖ్యలో తరలి వచ్చారు. కల్యాణ వేడుకకు మాజీఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు, మాజీఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్, నియోజకవర్గఇన్‌చార్జీ వొడితెలప్రణవ్ హాజరై ప్రత్యేకపూజలు నిర్వహించారు.

ఘనంగా మత్స్యగిరీంద్ర స్వామి జాతర

సైదాపూర్: మండలంలోని వెన్నంపల్లి గ్రామంలోగల మత్స్యగిరీంద్రస్వామి జాతర సోమవారం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయంవద్ద భక్తులు సుదర్శన హోమం చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో మాజీఅధ్యక్షుడు సారబుడ్ల రాజిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీల నియామకం

వీణవంక ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకృష్ణాపూర్, కిష్టంపేట, కొండపాక గ్రామాల కాంగ్రెస్‌పార్టీ గ్రామకమిటీలను మండల అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్‌రెడ్డి అధ్యక్షతన నియమించారు. రామకృష్ణాపూర్ గ్రామఅధ్యక్షుడిగా గొట్టెరాజయ్య, ప్రధానకార్యదర్శిగా మ్యాకల మహిపాల్‌రెడ్డి, కిష్టంపేట గ్రామశాఖ అధ్యక్షుడిగా మాదాసు వెంకటయ్య, ప్రధానకార్యదర్శిగా కల్లపల్లి అజయ్, కొండపాక గ్రామ శాఖ అధ్యక్షుడిగా కోడిపల్లి సతీష్, ప్రధాన కార్యదర్శిగా మ్యాడగోని శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు గంగాడి తిరుపతి రెడ్డి, చినాల అయిలయ్య, గెల్లుశ్రీనివాస్,భగవాన్ రెడ్డి, సిద్దపల్లి మహిపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళా డప్పు కళాకారులకు సన్మానం


కళాకారులను సన్మానిస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు

శంకరపట్నం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మెట్‌పల్లి మహిళా డప్పు కళాకారులను తెలంగాణ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తెలంగాణ అంబేద్కర్ సంఘం మండలాధ్యక్షుడు అంతడుపుల సతీష్ మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో 5వేల మందితో కళాప్రదర్శన చేసి గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించిన సందర్భంగా తెలంగాణ అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో మెట్‌పల్లి మహిళా డప్పు కళాకారులను ఘనంగా సన్మానించామన్నారు. కార్యక్రమంలో నాయకులు దాసరపు భద్రయ్య, కనకం శంకర్, బొజ్జ రవి, అంతడుపుల సంపత్, అంతడుపుల అశోక్, కళాకారులు దాసారపు భవానీ, క్యాదాసి రజిత, అంతడుపుల సుజాత, మారముళ్ల రజిత, దాసారపు స్వప్న తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్

చిగురుమామిడి/తిమ్మాపూర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జాతీయసైన్స్ దినోత్సవం పురస్కరించుకుని హుజురాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్‌ట్రస్టు ఆధ్వర్యంలో చిగురుమామిడి మండలంలోని చిన్నముల్కనూర్, తిమ్మాపూర్‌లోని మోడల్ స్కూల్ పదవతరగతి విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్టును నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఎం సిరివెన్నెల, ఆర్ సియోని, జి సిరి, సుహానాకు గంగిశెట్టి జగదీశ్వర్ (రిటైర్డ్ టీచర్) తదితరులు బహుమతులు అందించారు.

అర్చకుడిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

హుజూరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): చిలుకూరి బాలాజీ ఆలయ ప్రధానఅర్చకుడు రంగరాజన్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ బ్రాహ్మణ సేవాసమితి ఉమ్మడిజిల్లా అధ్యక్షుడు గోపాల్‌రావు అన్నారు. బుధవారం హుజూరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ అధికారులు, పోలీస్‌శాఖ వెంటనే దోషులపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు.

కార్యక్రమంలో బ్రాహ్మణసంఘం నాయకులు ఉపేందర్‌శర్మ, రమణరావు, పవన్ కుమార్‌శర్మ, సంపత్‌కుమార్, కేబీశర్మ, బాస్కర్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

పోస్టుకార్డులతో విద్యార్థినుల నిరసన

జమ్మికుంట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాహుల్ గాంధీ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలంటూ టీఆర్ఎస్వీ పట్టణ అధ్యక్షుడు కొమ్ము నరేష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు పోస్టుకార్డుల ద్వారా బుధవారం నిరసన తెలిపారు. 18సంవత్సరాలు నిండిన ప్రతిమహిళకు స్కూటీ, పదవ తరగతి పాస్‌అయినవారికి రూ.10వేలు, తదితరాలు ఇస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఇచ్చినహామీలు అమలుచేయాలని కోరుతూ రాహుల్‌గాంధీకి చేరేవిధంగా పోస్ట్‌కార్డులు పోస్ట్ చేస్తున్నట్లు తెలిపారు.

శ్రీచైతన్య కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

తిమ్మాపూర్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): శ్రీచైతన్య ఫార్మసీ కళాశాలలో బుధవారం ఫామ్‌డి ప్రథమసంవత్సరం విద్యార్థులు ఫ్రెషర్స్ డేవేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుతూ ఉన్నతశిఖరాలను అధిరోహించాలన్నారు. ఈసందర్భంగా పోటీల్లోగెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. విద్యార్థుల సాంస్కృతికప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాలడైరెక్టర్ నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రామనర్సింహారెడ్డి, అధ్యాపకులు రవీందర్‌రెడ్డి, రాంప్రసాద్, చంద్రమౌళి విద్యార్థులుపాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల సదస్సు

వీణవంక, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని సబ్‌స్టేషన్ కార్యాలయ ఆవరణలో బుధవారం అధికారులు విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ వినియోగదారుల నుంచి సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. పలువురు రైతులు, నాయకులు లో వోల్టేజీ సమస్యను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ ఎన్‌వీ వేణుగోపాలచారి, సభ్యులు కె రమేష్, చరణ్‌దాసు తదితరులున్నారు.

బాలల పరిరక్షణ కమిటీ సమావేశం

చొప్పదండి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం బాలల పరిరక్షణ కమిటీసమావేశం జరిగింది. బాల్యవివాహాల నివారణ, పిల్లల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి విజయలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు స్వరూప, మంగ, ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా నాగవెల్లి పట్నం

గంగాధర, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొచ్చగుట్ట మల్లికార్జున స్వామి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. బుధవారం నాగవెల్లి పట్నం వేశారు. అనంతరం జరిగిన ఒగ్గు కథ భక్తులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. కాచిరెడ్డిపల్లి, వెంకటయ్యపల్లి, కొండయ్యపల్లి, చర్లపల్లి (ఎన్), పానుగంటిపల్లిగ్రామాల భక్తులు తరలివచ్చిమొక్కులు చెల్లించుకున్నారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

● మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

గన్నేరువరం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావుతో కలిసి హాజరయ్యారు. ఈసందర్భంగా మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే తన గెలుపన్నారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, మాజీసర్పంచ్ పుల్లెల లక్ష్మిలక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.